నేను స్థానికుడిని.. సమస్యలు పరిష్కరిస్తా

• కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు


మాట్లాడుతున్న కాంగ్రెస్‌ అభ్యర్థి రాజేందర్‌రావు, పక్కన ఎమ్మెల్యే సత్యం

రామడుగు: నేను స్థానికుడిని.. నాకే ఓటు వేసి, గెలిపించాలని కరీంనగర్‌ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కోరారు. తన స్వగ్రామం రామడుగు మండలంలోని గుండితోపాటు గోపాల్‌రావుపేటలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి శనివారం ఉదయం కార్నర్‌ మీటింగ్‌ నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి తన వంతుగా ఎప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. డీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్‌, మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించండి


రంగసాయిపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు రంగసాయిపల్లిలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నమూనా ఈవీఎంను ఓటర్లకు చూపిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు కట్ట రవీందర్‌, శ్రీనివాసాచారి, రవి, శేఖర్‌, తిరుపతి, వెంకట్‌రెడ్డి, శ్రీరామ్‌, అభిలాశ్‌, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్‌ ర్యాలీ

రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటలో బీజేపీ నాయకులు శనివారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్‌యాదవ్‌, నాయకులు ఉప్పు రాంకిషన్‌, పాచంపల్లి నరేష్‌, పూరెల్ల శ్రీకాంత్‌, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే 'కారు'కు ఓటేయాలి

• చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌


కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌

గంగాధర: కరీంనగర్‌ పార్లమెంట్‌ నియోజవర్గ పరిధిలో అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్‌ కారు గుర్తుకు ఓటేసి, వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ పిలుపునిచ్చారు. శనివారం గంగాధర మండలంలోని కొండన్నపల్లి, ఉప్పరమల్యాల గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో కలిసి పని చేశారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఖతం చేసి, బీజేపీని బొంద పెడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. నాయకులు విజయేందర్‌రెడ్డి, గంగాధర్‌, మధుసూదన్‌ తదితరులున్నారు.

క్లుప్తంగా

గోషామహల్‌ ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

ఇల్లందకుంట/హుజూరాబాద్‌: బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ శనివారం జమ్మికుంటలో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్‌ సమావేశానికి హాజరయ్యారు. అంతకుముందు బీజేపీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు హుజూరాబాద్‌కు బైక్‌ ర్యాలీ చేపట్టి, ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి జమ్మికుంటకు తరలివెళ్లారు. నాయకులు బైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్‌, మట్ట పవన్‌రెడ్డి, అబ్బిడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధమండల మాలధారణ

జమ్మికుంట: మారుతీనగర్‌ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్‌ భక్తులు శనివారం అర్ధమండల మాలధారణ చేపట్టారు. మాలధారణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అర్చకుడు ప్రసాదాచార్యులు అన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

ఓటరు అవగాహన సదస్సు

చొప్పదండి: చొప్పదండి లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో శనివారం వాకర్స్‌ క్లబ్‌ సభ్యులు స్థానిక వాకర్స్‌ గ్రౌండ్‌లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. క్లబ్‌ ఉపాధ్యక్షుడు గొల్లపల్లి నరేశ్‌ మాట్లాడుతూ.. డబ్బుకు ఆశ పడకుండా నిజాయతీ గల అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. దేశంలో 65 శాతం ఓటర్లు మాత్రమే ఓటుహక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిపుష్టికి 100 శాతం ఓటింగ్‌ జరగాలని పిలుపునిచ్చారు. నాయకులు దూస రాము, కొల్మూరి జితేందర్‌, తొడుపునూరి లక్ష్మయ్య, వల్లాల జగన్‌, చీకట్ల కుమార్‌, సామల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించాలని వేధింపులు

• వివాహిత ఆత్మహత్య

గంగాధర: ప్రేమించాలంటూ వేధించడంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గంగాధర మండల కేంద్రం పరిధి తుర్కకాశీ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తుర్కకాశీ నగర్‌కు చెందిన వివాహితను మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన సయ్యద్‌ ముబారక్‌ ప్రేమ పేరుతో వేధించాడు. దీంతో గత శుక్రవారం మంగపేట శివారు వ్యవసాయబావిలో దూకింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో సయ్యద్‌ ముబారక్‌ను శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే బురదలో వేసినట్లే

• చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం, పక్కన నాయకులు

గంగాధర: పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌, బీజేపీల మధ్యే పోటీ అని, ఢిల్లీలో, గల్లీలో లేని బీఆర్‌ఎస్‌ గల్లంతయిందని, ఆ పార్టీకి ఓటు వేస్తే బురదలో వేసినట్లేనని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలంలోని మధురానగర్‌ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోందని ఆరోపించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలోనే రిజర్వేషన్లు రద్దు చేయాలని ప్రయత్నిస్తే దేశ ప్రజల వ్యతిరేకతతో నిలిచిపోయిందన్నారు. పదేళ్లు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రారంభించిందన్నారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కరీంనగర్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెలిచాల తిరుమల్‌రావు, పురమల్ల మనోహర్‌, పుల్కం నర్సయ్య, సత్తు కనకయ్య, పడిదపల్లి కిషన్‌, గునుకొండ బాబు, కర్ర విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో రాబోది కాంగ్రెస్‌ ప్రభుత్వమే

చిగురుమామిడి: కేంద్రంలో రాబోది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని, రెండుసార్లు గద్దెనెక్కిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు చేసిందేమీ లేదని జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌ గీకురు రవీందర్‌ అన్నారు. శనివారం సాయంత్రం చిగురుమామిడి మండల కేంద్రంలో సీపీఐ, కాంగ్రెస్‌ నాయకులు, మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌, బీజేపీ రెండూ ఒక్కటేనన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్‌ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును చేతి గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని కోరారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్‌, జిల్లా నాయకుడు పూల లచ్చిరెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు తేరాల సత్యనారాయణ, గూడెం లక్ష్మి, కాంగ్రెస్‌ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పోలు స్వప్న, నాయకులు పోటు మల్లారెడ్డి, వంగ కనకయ్య, సంపత్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ అభ్యర్థిని గెలిపించాలి

రామడుగు: మతతత్వ బీజేపీని ఓడించాలని కాంగ్రెస్‌ కరీంనగర్‌ పార్లమెంట్‌ ఎస్సీ విభాగం ఎన్నికల ఇన్‌చార్జి వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో కోరారు. పదేళ్ల బీజేపీ పాలనలో దళితులు, ముస్లింలు, క్రిస్టియన్లకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలన్నారు.

నాయకుల ప్రచారం

సైదాపూర్‌: మండలంలోని రాంచంద్రాపూర్‌, పెరుకపల్లి గ్రామాల్లో కాంగ్రెస్‌ జిల్లా నాయకుడు గుండారపు శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ కృషి చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్‌ ఎన్నికలు ముగియగానే పేదలకు ఇళ్లు, కొత్త రేషన్‌ కార్డులు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటేసినా, బీజేపీకి ఓటేసినా వారు గెలిచి, గ్రామాల్లో చేసేదేమీ లేదన్నారు. కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును హస్తం గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని కోరారు.

గ్యారంటీలు అమలు చేశాం.. గెలిపించండి

• కాంగ్రెస్‌ హుజూరాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌


బైక్‌ ర్యాలీ తీస్తున్న ప్రణవ్‌, నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేశాం.. తమకే ఓటు వేసి, గెలిపించాలని ఆ పార్టీ హుజూరాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ కోరారు. జమ్మికుంట మున్సిపల్‌ పరిధిలో శనివారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్‌ ఎన్నికలు పూర్తవగానే కొత్త రేషన్‌ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యస్థాపన కోసం దేశ ప్రధానిగా రాహుల్‌ గాంధీ ఉండటమే లక్ష్యంగా ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. మున్సిపల్‌ కొత్తపల్లి ఏరియాలో మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ దేశిని స్వప్నకోటి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ చేతి గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు.

బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ మోసం చేసే పార్టీలు

• సీఎం రేవంత్‌రెడ్డిది కేసీఆర్‌ను మించిన గారడీ
• చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ

మానకొండూర్‌: బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ ప్రజలను మోసం చేసే పార్టీలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ అన్నారు. మానకొండూర్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలను బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ తమ హామీలతో మోసగించాయని ఆరోపించారు. అబద్ధాల మీద గద్దెనెక్కిన కాంగ్రెస్‌ బీఆర్‌ఎస్‌ పాలసీనే అమలు చేస్తోందన్నారు. రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2,500, విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, రూ.4 వేల పింఛన్‌ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను మించిన గారడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో మన హైదరాబాద్‌లో ఎలాంటి అల్లర్లు, బ్లాసింగ్‌లు జరగలేదని తెలిపారు. ఆయన దేశాన్ని కంటికిరెప్పలా కాపాడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌, కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, ఎన్నికల కోసమే వచ్చారని, తమ డిపాజిట్ల కోసం ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్‌, నాయకులు సిరిసిల్ల చంద్రయ్య, బాషబోయిన ప్రదీప్‌, కత్తి ప్రభాకర్‌, శ్రీనివాస్‌, రాజిరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీని ఇంటికి సాగనంపాలి

• టీజేఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం


మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ కోదండరాం

హుజూరాబాద్‌: ప్రధాని మోదీ కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ వారికి అనుగుణంగా చట్టాలను మారుస్తున్నారని టీజేఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం ఆరోపించారు. శనివారం హుజురాబాద్‌ పట్టణంలోని సిటీ సెంట్రల్‌ ఫంక్షన్‌ హాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. 2014 పార్లమెంట్‌ ఎన్నికల్లో మోదీ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కారని, తర్వాత ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ప్రతీ పౌరుని ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని చెప్పి, ఒక్కరికీ వేయలేదని పేర్కొన్నారు. మేకిన్‌ ఇండియా పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌ పెట్టుబడిదారులకు అమ్మేస్తున్నారని మండిపడ్డారు. ఒకే దేశం, ఒకే పన్ను పేరుతో జీఎస్టీ లాంటి పన్నులను ప్రజల మీద బలవంతంగా రుద్దారన్నారు. దీని ఫలితంగా స్వయం ఉపాధి రంగంలోని చిన్న వ్యాపారాలు కుప్పకూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఉద్యోగాలను కల్పించకపోగా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని లక్షలాది మంది శాశ్వత ఉద్యోగులను వీఆర్‌ఎస్‌ పేరుతో తొలగించారని తెలిపారు. నిరుద్యోగులే బీజేపీని ఓడించి, మోదీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడు అంబటి నాగయ్య, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు కన్నెగంటి రవి, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్‌ కూరపాటి వెంకటనారాయణ, టీజేఎస్‌ రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, నాయకులు వేల్పుల రత్నం, వేల్పుల ప్రభాకర్‌, పల్కల ఈశ్వర్‌రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీని ఓడిద్దాం'


మాట్లాడుతున్న సాగర్‌

జమ్మికుంట: రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీని పార్లమెంట్‌ ఎన్నికల్లో ఓడిద్దామని అంబేద్కర్‌ యువజన సంఘం హుజూరాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్‌ పిలుపునిచ్చారు. శనివారం జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలందరూ సమాన హక్కులతో జీవించాలన్న లక్ష్యంతో అంబేద్కర్‌ రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వేలాది మంది దళిత, గిరిజన, మైనార్టీ వర్గాల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రక్షించుకోవాలంటే బీజేపీని ఓడించాలని కోరారు. మాజీ సర్పంచ్‌ రాచపల్లి సమ్మయ్య, నాయకులు శివ, శ్రీనివాస్‌, ఇమ్రాన్‌, కుమార్‌, రవి, అక్బర్‌, రత్నాకర్‌ తదితరులున్నారు.

బీజేపీ నాయకుల బైక్‌ ర్యాలీ


బైక్‌ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రదీప్‌కుమార్‌

చిగురుమామిడి: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శనివారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. పార్లమెంట్‌ ఎన్నికల్లో బండి సంజయ్‌కుమార్‌ గెలుపు తథ్యమన్నారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మండల ఎన్నికల ఇన్‌చార్జి అమరగాని ప్రదీప్‌కుమార్‌, జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్‌, నాయకులు మురళీమనోహర్‌, శ్రీనివాస్‌, శంకర్‌, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మానకొండూర్‌: గంగిపల్లిలో బీజేపీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరీంనగర్‌ అభివృద్ధి కోసం బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు రంగు భాస్కరాచారి, అంబటి తిరుపతిరాజు, కాడ మొగిలిగౌడ్‌, బండ రాజిరెడ్డి, కనకం నాగయ్య, వెంకటరాజం తదితరులున్నారు.

నర్మదా నది జలాలతో అభిషేకం


జలాలను పంపిణీ చేస్తున్న అర్చకులు

చొప్పదండి: పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయంలో మూలవిరాట్‌లకు అర్చకులు శనివారం నర్మదా నది జలాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సింహాచలం జగన్‌మోహన్‌స్వామి, అర్చకుడు భాష్యం నవీన్‌కుమార్‌ మధ్యప్రదేశ్‌లో నది పుష్కరాలకు హాజరై, ఏక లింగేశ్వర ఆలయం నుంచి జలాలను తీసుకువచ్చారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

'మూడు పార్టీలు చేస్తుంది ద్రోహమే'


మాట్లాడుతున్న విశారదన్‌ మహరాజ్‌

జమ్మికుంట: బీజేపీ, కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌.. ఈ మూడు పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ద్రోహమే చేస్తున్నాయని ధర్మ సమాజ్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్‌ మహరాజ్‌ ఆరోపించారు. శనివారం జమ్మికుంట పట్టణంలో పార్టీ కరీంనగర్‌ ఎంపీ అభ్యర్థి చిలువేరు శ్రీకాంత్‌కు మద్దతుగా రోడ్‌ షో నర్వహించారు. మూడు పార్టీలను ఎదుర్కొనేందుకు, బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడేందుకు ధర్మ సమాజ్‌ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లు 90 శాతం ఉన్న కులాలకు రాజకీయ వాటా ఇవ్వడం లేదని మండిపడ్డారు. నిబద్ధత కలిగిన శ్రీకాంత్‌ను చెప్పుల గుర్తుకు ఓటు వేసి, గెలపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన


మోడల్‌ పోలింగ్‌ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో పీడీ శ్రీధర్‌

మానకొండూర్‌: దేవంపల్లి, గంగిపల్లి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను డీఆర్డీవో పీడీ శ్రీధర్‌ శనివారం పరిశీలించారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పూర్తి చేయాలని ఎస్‌ఎంసీలకు సూచించారు. గంగిపల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయి, కూలీ గిట్టుబాటు అవుతుందా అడిగి అడిగారు. అనంతరం లలితాపూర్‌ మోడల్‌ పోలింగ్‌ స్టేషన్‌ను సందర్శించి, పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో నర్సయ్య, ఎంపీవో రాజేశ్వర్‌రావు, ఏంఈవో మధుసూదనాచారి, ఆదర్శ పాఠశాలల కమిటీ మెంబర్లు, ఏపీఎం నిరంజన్‌, వీవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్‌ పోలింగ్‌ స్టేషన్‌ పరిశీలన

రామడుగు: వెదిర గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్‌ పోలింగ్‌ స్టేషన్‌(91)ను ఎంపీడీవో రాజేశ్వరి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామడుగు మండలంలో వెదిర, వెలిచాల గ్రామాల్లో మోడల్‌ పోలింగ్‌ స్టేషన్‌ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లను ఆకర్షించేలా వీటిని ప్రత్యేకంగా అలంకరించినట్లు పేర్కొన్నారు. ప్రతీ ఓటరు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్‌, బీఎల్‌వో అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చేసిన అప్పు రూ.103 లక్షల కోట్లు

• కేయూ ప్రొఫెసర్‌ వీరన్న నాయక్‌


మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ వీరన్న నాయక్‌

చిగురుమామిడి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడమే కాకుండా రూ.103 లక్షల కోట్ల అప్పు చేసిందని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ వీరన్న నాయక్‌ ఆరోపించారు. శనివారం చిగురుమామిడి మండలంలోని సుందరగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో రైతులు గిట్టుబాటు ధర కోసం ఉద్యమాలు చేస్తే 750 మందిని చంపించారని మండిపడ్డారు. కేంద్రం పరిధిలో దాదాపు 30 లక్షల ఉద్యోగ ఖాళీలుండగా అందులో ఒక్కటి కూడా భర్తీ చేయలేదని తెలిపారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు ఓటువేసి, దేశాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. గిరిజన మేధావుల ఫోరం కన్వీనర్‌ చెప్యాల ప్రకాశ్‌, అంబేడ్కర్‌ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బదావత్‌ వీరస్వామి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్‌ శ్రీమూర్తి రమేశ్‌, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి ఓరుగంటి భారతీదేవి, నాయకులు పాల్గొన్నారు.

'విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉండొద్దు'

హుజూరాబాద్‌ రూరల్‌: పార్లమెంట్‌ ఎన్నికల పోలింగ్‌ వేళ విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉండొద్దని జిల్లా ఎస్‌ఈ గంగాధర్‌ అన్నారు. పెద్దపాపయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాన్ని అధికారులతో కలిసి, పరిశీలించారు. పోలింగ్‌ సమయంలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఓటర్లకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ధనవంతుల అభివృద్ధికి ప్రధాని కృషి

సైదాపూర్‌: బీజేపీకి పేదల సంక్షేమం పట్టదని, ప్రధాని మోదీ ధనవంతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్‌ ఆరోపించారు. శనివారం సైదాపూర్‌లో ఆయన మాట్లాడారు. కార్పొరేట్‌ వ్యవసాయానికే నల్ల చట్టాలు తీసుకువచ్చారన్నారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు తీసేస్తామనడం దారుణమన్నారు.

'కేసీఆర్‌ వందల హామీలు అమలు చేయలే'

సైదాపూర్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి, 5 నెలలే అవుతోందని టీపీసీసీ లీగల్‌ సెల్‌ అధికార ప్రతినిధి వేముల రమేశ్‌ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ నెరవేర్చడం లేదనే నైతికత కేసీఆర్‌, హరీశ్‌రావు, కేటీఆర్‌లకు లేదని పేర్కొన్నారు. శనివారం సైదాపూర్‌లో మాట్లాడుతూ.. దళితుడిని సీఎం చేయలేదని, మూడెకరాల భూమి, అర్హులకు ఇళ్లు, రేషన్‌ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఇలా వందల హామీలను అమలు చేయలేదని ఆరోపించారు.

ఎన్నికల సిబ్బందికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

• హుజూరాబాద్‌ ఏసీపీ శ్రీనివాస్‌జీ
• ఎన్నికల డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ పరిశీలన


డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్‌: పార్లమెంట్‌ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందుల్లేకుండా చూడాలని హుజూరాబాద్‌ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆదేశించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ను ఎన్నికల సహాయ అధికారి రమేశ్‌బాబు, పట్టణ సీఐ రమేశ్‌లతో కలిసి, పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.